క్లుప్తంగా

నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన



ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

గంగవరం: రాష్ట్ర వ్యాప్తంగా వున్న వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలిపారు. వారు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైద్యులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

నేడు జాబ్ మేళా

చౌడేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పుంగనూరు మండలం గూడూరుపల్లి వద్దగల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం సుబ్రమణ్యం తెలిపారు. 10 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఆపై ఉన్నత చదువులు చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపున్న యువతీ యువకులు హాజరుకావచ్చని తెలిపారు.

గ్రామాల్లో నీతి అయోగ్ బృందం సర్వే



లద్దిగంలో ఇంటింటికీ వెళ్లి విచారిస్తున్న నీతి అయోగ్ సభ్యుడు

చౌడేపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీపై నీతి అయోగ్ బృందం సభ్యులు సోమవారం సర్వే చేశారు. మండలంలోని లద్దిగం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల ఎత్తుకు తగినట్టు బరువు ఉన్నారా లేదా అని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ఇంటింటికీ వెళ్లి విచారించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచన, అంగన్‌వాడీ కార్యకర్త శంకరమ్మ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పుంగనూరు: పట్టణానికి చెందిన ఓ యువతి ఈనెల 9వ తేదీ నుంచి కనిపించడం లేదని సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. శాంతినగర్‌కు చెందిన యువతి తండ్రి అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు తిరుపతి వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యశాల నుంచి ఈనెల 9న ఇంటికి తిరిగి రాగా కుమార్తె కనిపించకుండాపోయింది. సమీప బంధువులను, చుట్టు పక్కల ప్రాంతాల వారిని, తెలిసిన వారిని వాకాబు చేశారు. యువతి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీవద్దు-స్వదేశీ ముద్దు

రొంపిచెర్ల: విదేశీ వస్తువుల కొనుగోలు చేయడం ప్రజలు మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు జి.నాగరాజ కోరారు. ఆయన సోమవారం రొంపిచెర్లలో విదేశీవద్దు- స్వదేశీ ముద్దు అనే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విదేశాల్లో తయారు చేసిన వసువులను కొనుగోలు చేయడం వల్ల వారికి ఆదాయం వస్తుందని తెలిపారు. తద్వారా మన దేశానికి నష్టం కలుగుతోందని తెలిపారు. ఇక్కడి వస్తువులను కొనుగోలు చేయడం వల్ల మనకే ఆదాయం వచ్చి దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు అబ్బారెడ్డి వెంకటరమణ నాయుడు, మునిరత్నం, ముచ్చింతల వెంకటరమణ నాయుడు, సుధాకర్ రెడ్డి, ఆవుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గరిగచీనేపల్లి అధ్యక్షుడిగా రవి

కుప్పం రూరల్: కుప్పం మండలం గరిగచీనేపల్లిలో సోమవారం వైఎస్సార్ సీపీ పంచాయతీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా చంద్ర, యువత అధ్యక్షుడిగా సెల్వ ఎన్నికయ్యారు. మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ మాట్లాడుతూ అధికార పార్టీ చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎప్పకప్పుడు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శీను, ఈశ్వర్, రమేష్, ముత్తు పాల్గొన్నారు.

మండలానికి ముగ్గురు కొత్త టీచర్లు



ఎంఈవోలకు నాయమక పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): డీఎస్సీ-25లో ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులను పులిచెర్ల మండలానికి కేటాయించినట్టు ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. ఉపాధ్యాయులు ఎంఈవోలకు నియామక పత్రాలు అందజేశారు. ఎంపీపీ స్కూల్ తెట్టు పల్లెకు జి.మహేష్, ఆర్‌వడ్డి పల్లెకు ఎస్.షమీర్, వీసీ వడ్డిపల్లెకు ఎం మహర్షి నియమితులయ్యారు.



పుంగనూరులో సీఐకి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, మహిళలు మంజుల, ధనమ్మ, నాయకులు



కుప్పం: ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ భరత్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



ఎక్సైజ్ సీఐలకు వినతి పత్రం ఇస్తున్న పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

కల్తీ మద్యంతో ఇంకెన్ని ప్రాణాలు పోవాలి?

- రాష్ట్రంలో 11 చోట్ల కల్తీ మద్యం తయారీ స్థావరాలు
- గ్రామాల్లో కూటమి కార్యకర్తల ద్వారా అమ్మకాలు
- ఇప్పటికే రూ.5,200 కోట్ల విక్రయాలు
- ఎక్సైజ్‌శాఖ పట్టించుకోకుంటే మేమే బెల్టు తీస్తాం
- వైఎస్సార్ సీపీ నాయకుల హెచ్చరిక
- నారావారి కల్తీ మద్యంపై పెల్లుబికిన నిరసనలు



పలమనేరు: ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పలమనేరు : వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

పలమనేరు: కూటమి ప్రభుత్వం హయాలో కల్తీ మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పలమనేరు నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేగౌడ ఆరోపించారు. కల్తీ మద్యం తాగి ఇప్పటికే ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, ఇంకెన్ని ప్రాణాలు పోవాలని నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు సోమవారం పలమనేరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ముందుగా స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ సీఐ భాగ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో మారుమూల గ్రామంలో సైతం బెల్టుషాపులు ఏర్పాటయ్యాయని తెలిపారు. కూటమి నాయకులు కల్తీ మద్యం తయారు చేసి వారి కార్యకర్తల ద్వారా బెల్టు షాపుల్లో విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపించారు.

11 చోట్ల కల్తీ మద్యం తయారీ స్థావరాలు

ములకలచెరువులో కూటమి పార్టీ నాయకుడు కల్తీ మద్యం తయారీ పరిశ్రమను ఏర్పాటుచేసి విక్రయాలు సాగిస్తున్న విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఇలాంటి స్థావరాలు రాష్ట్రంలో మరో 11 చోట్ల వున్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వెంకటేగౌడ తెలిపారు. ఎన్నికల్లో నాణ్యమైన మద్యం ఇస్తామన్న కూటమి హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇస్తే కల్తీ మద్యం విక్రయాలు సాగిస్తూ వారి రక్తాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారని దుయ్యబట్టారు. కల్తీ మద్యం తయారీ పరిశ్రమను ఏర్పాటుచేసిన తంబళ్లపల్లి టీడీపీ నాయకుడికి టికెట్ ఇచ్చింది చంద్రబాబు, లోకేష్ కాదా అని ప్రశ్నించారు. దొంగ దొరికిన తర్వాత తమ పార్టీ కాదని బుకాయిస్తూ వైఎస్సార్ సీపీపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం చంద్రబాబు, ఆ పార్టీ నాయకులకు తెలిసినంతగా ఇంకెవరికీ తెలీదన్నారు.

బెల్టు షాపులను మేమే తొలగిస్తాం

చిత్తూరు జిల్లాలో వున్న బెల్టు షాపులను తొలగించడానికి ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని వెంకటేగౌడ డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకోని పక్షంలో తామే బెల్టు షాపులను పట్టుకుని అధికారులకు అప్పగిస్తామని హెచ్చరించారు. కూటమి అధికారంలోకి వచ్చాక మద్యం విక్రయాలతోపాటు ఇసుక, మట్టి, జల్లి మాఫియా పేట్రేగిపోతోందన్నారు. కల్తీ మద్యం స్కాంపై సీబీఐ ద్వారా విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, చెంగారెడ్డి, మండీసుధ, ప్రహ్లాద, వి.కోట ఎంపీపీ యువరాజ్, పలమనేరు, రూరల్, పెద్దపంజాణి కన్వీనర్లు హేమంత్‌కుమార్‌రెడ్డి, బాలాజీనాయుడు, బాగారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారావారి కల్తీ మద్యంపై భగ్గుమన్న జనం

పుంగనూరు: కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కల్తీ మద్యం తయారు చేసి విక్రయాలు సాగిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని, కల్తీ మద్యం విక్రయాలపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ రెడ్డెప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్ సోమవారం పుంగనూరులో నిరసన ర్యాలీ చేశారు. ఇందులో పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. బస్టాండ్‌లోని రాజన్న విగ్రహం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడినప్పటి నుంచి కల్తీ మద్యం మాఫియా కల్తీ మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో నిరసనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండలాల కన్వీనర్లు ఇర్ఫాన్, అమరనాథరెడ్డి, నాయకులు పూలత్యాగరాజు, ఆవుల అమరేంద్ర, కళ్యాణభారత్, రాజేష్, సూరి, హేమంత్, అస్లాంమురాది, గౌస్, సుబ్రమణ్యం, శంకరప్ప, మంజుల, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం జోరు



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు

కుప్పం: కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కల్తీ మద్యాన్ని తయారు చేసి విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్ ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపుమేరకు సోమవారం కల్తీ మద్యం విక్రయాలపై స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ముందుగా ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ సీఐ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కల్తీ మద్యం తయారీని అరికట్టాలని డిమాండ్ చేశారు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రనాయుడు కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కల్తీ మద్యం తయారీపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి పాలనలో ఏడాదిన్నర పాలనలో రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి 421 మంది మృతి చెందారని ఆరోపించారు. చిత్తూరు పార్లమెంటరీ పరిశీలకులు చవ్వా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నారా వారి నారా కల్తీ పాలనపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

నాయకులను అడ్డుకున్న పోలీసులు

అంతకుముందు ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కార్యాలయంలోకి ఐదుగురు మాత్రమే వెళ్లాలని ఎస్ఐ బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాల కన్వీనర్లు కోదండరెడ్డి, మురుగేష్, రామక్రిష్ణ, బుల్లెట్ దండపాణి, బాబురెడ్డి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, నితిన్‌రెడ్డి, భాగ్యరాజ్, మోహన్‌రామ్, మునిరాజ్ పాల్గొన్నారు.

యువత మరింత బాధ్యతగా పనిచేయాలి



యూత్ విభాగం నేతలతో వెంకటేగౌడ

పలమనేరు: నియోజకవర్గంలో ఇటీవల కొత్తగా నియమితులైన వైఎస్సార్ సీపీ యూత్ విభాగం నేతలు పార్టీ బలోపేతం కోసం మరింత బాధ్యతగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేగౌడ తెలిపారు. ఆయన సోమవారం పార్టీ యూత్ విభాగం నాయకులతో మాట్లాడారు. గ్రామస్థాయిలో యువతను పార్టీలో కీలకం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలమనేరు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ తరుణ్, జనరల్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, చెంగారెడ్డి, మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రంగన్న, చంద్రారెడ్డి, గోవిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో మెప్మా బజారు



మెప్మా బజారును పరిశీలిస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: పట్టణంలోని పొదుపు సంఘాల సభ్యులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా బజారును ఏర్పాటు చేశారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి బజారును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు సొంతంగా తయారు చేసిన బ్యాగులు, దుస్తులు తదితరాలను మెప్మా బజారులో విక్రయిస్తారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మెప్మా బజారు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జీఎస్టీ అధికారి ఉదయ్‌కుమార్ జీఎస్టీ 2.0పై మహిళలకు అవగాహన కల్పించారు.

వైద్య విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి

గుడుపల్లె: వైద్య విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని పీఈఎస్ కళాశాల డైరెక్టర్ సురేష్ కృష్ణమూర్తి తెలిపారు. పీఈఎస్ కళాశాలలో సోమవారం 24వ బ్యాచ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తికి ఎంతో విలువ వుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హెచ్ఆర్ కృష్ణారావు, మెడికల్ కన్సల్టెంట్ కౌశిక్, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

23 వరకు అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ



మాట్లాడుతున్న మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ్‌కుమార్

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటుచేసిన అక్రమ లేఅవుట్లు, ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఈ నెల 23 వరకు అవకాశం ఉందని టౌన్ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నుంచి పలు వెసలుబాట్లు వున్నాయని తెలిపారు. అవసరమున్న వారు స్థానిక టీపీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. కమిషనర్ రమణారెడ్డి, టీపీఎస్ ఇందిర, టీపీవోలు పాల్గొన్నారు.

వాహనాల వేలం వాయిదా

వి.కోట: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలాన్ని వాయిదా వేసినట్టు ఎక్సైజ్ సీఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. 6 ద్విచక్ర వాహనాలు, ఒక లగేజీ ఆటోను ఈ నెల 15వ తేదీన బహిరంగ వేలం వేయాలని గతంలో నిర్ణయించినట్టు తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. తదుపరి వేలం తేదీని పత్రికల ద్వారా తెలియజేస్తామని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పలమనేరు: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని పలమనేరు ఏవో సంధ్యారాణి తెలిపారు. ఆమె సోమవారం పెంగరగుంట వద్ద రైతు రమణారెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతు వరి పంటకు ద్రవ జీవామృతం, వేపపిండి తదితరాలు వేశారని తెలిపారు. మిగిలిన రైతులు కూడా వరి పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2025-2026 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఎలక్ట్రీ షియన్, డీజిల్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. పది, ఇంటర్మీడియట్ పాస్ లేక ఫెయిలైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉందని వెల్లడించారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



కృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మేలుపట్ల కృష్ణారెడ్డి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరుకు చేరుకున్నారు. కృష్ణారెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, జయరామిరెడ్డి, మధు ఉన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ

కుప్పం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. వాటిని పరిశీలించి త్వతిరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా రోడ్లు, వాగులు, వంకలపై దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

బైరెడ్డిపల్లె: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల హెడ్యుకేటర్లు కాంతమ్మ, సావిత్రమ్మ తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం కమ్మనపల్లె గురుకుల, బైరెడ్డిపల్లె బాలికల పాఠశాలల్లో విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ చేసుకోవడం వల్ల బాలికల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందన్నారు. ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా యువతులు ఎదుగుతున్నారని, ఆ సంఖ్య తగ్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందని వివరించారు. అనంతరం గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమిత్ర, సీహెచ్‌వో సాయిదివ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో మాజీ ఎమ్మెల్యే పర్యటన

పెద్దపంజాణి: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం పెద్దపంజాణి మండలంలో పర్యటించారు. గుండ్లపల్లిలో వారం క్రితం గృహ ప్రవేశం చేసిన కొళత్తూరు సర్పంచ్ రవికుమార్ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చింతలపల్లికి చేరుకుని అనంతకుమార్ దంపతులను ఆశీర్వదించారు. పెద్దవెలగటూరులో అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న మునిరత్నంను, ప్రమాదానికి గురైన కంగానం బండ శ్రీనివాసులును పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మేధావుల ఫోరం అధ్యక్షుడు గుర్నాథరెడ్డి, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, సర్పంచులు రమేష్, అమర్నాథరెడ్డి తదితరులు వున్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు

గుడుపల్లె: మండలంలో మల్దేపల్లిలో వెలసిన చౌడేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మహా కుంభాభిషేకం, మహామంగళహారతి ఇచ్చారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. రాత్రి సాంస్కృతి, కార్యక్రమాలు నిర్వహించారు.